https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 02 సంచిక : 7 గురువారం 30-4-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం

Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో
నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలని కోరుకుంటున్నారా?

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో పనిచేసేందుకు విలేఖరులు కావలెను...
మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు
9989788438, 9505485656.

# అసోంలో బీజేపీకి హ్యాట్రిక్ విజయం..

## తమిళనాడులో స్టాలిన్‌కే మళ్లీ పట్టం.. హంగ్ వస్తే కింగ్‌మేకర్‌గా విజయ్

### కేరళ పగ్గాలు కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్‌కు

### పుదుచ్చేరి మళ్లీ ఎన్డీయేదే!



**హైదరాబాద్, ఏప్రిల్ 29**
దశాబ్దాలపాటు కమ్యూనిస్టుల పాలనలో, గత 15 ఏళ్లుగా తృణమూల్ కాంగ్రెస్ అధినాయకురాలు మమతా బెనర్జీ పాలనలో ఉన్న పశ్చిమ బెంగాల్ మీద తమ జెండాను ఎగురవేయాలన్న బీజేపీ లక్ష్యం ఈసారి దాదాపుగా నెరవేరినట్లేనని తెలుస్తోంది. బెంగాల్‌లో బీజేపీ అధికారంలోకి వచ్చే అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని పలు సర్వే సంస్థలు వెల్లడించాయి. బుధవారం బెంగాల్‌లో రెండో దశ ఎన్నికలు ముగియటంతో మొత్తం నాలుగు రాష్ట్రాలు, కేంద్ర పాలితప్రాంతం పుదుచ్చేరిలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ పర్వం పూర్తయ్యింది. దీంతో పలు మీడియా, సర్వే సంస్థలు ఎగ్జిట్‌పోల్స్‌ను విడుదల చేశాయి. అసోంలో బీజేపీ హ్యాట్రిక్ సాధిస్తుందని, తమిళనాడులో డీఎంకే పట్టు నిలుపుకొని వరుసగా రెండోసారి స్టాలిన్ నేతృత్వంలో విజయం సాధించనుందని, కేరళలో వామపక్ష కూటమి ఎల్డీఎఫ్ గద్దె దిగి కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ కూటమి పగ్గాలు చేపట్టనుందని తెలిపాయి. పుదుచ్చేరిలో మళ్లీ ఎన్డీఏ కూటమికే అధికారమని పేర్కొన్నాయి. పశ్చిమ బెంగాల్‌లో 294 అసెంబ్లీ స్థానాలుండగా మ్యాజిక్ ఫిగర్ 148. ఆ రాష్ట్రంలో బీజేపీ 142 నుంచి 150 సీట్ల వరకూ గెల్చుకొని మొట్టమొదటిసారిగా అధికారంలోకి రానుందని పలు సర్వే సంస్థలు తెలిపాయి. బీజేపీ 146–161 సీట్లు గెలుచుకుంటుందని, టీఎంసీకి 125–140 సీట్లు వస్తాయని మ్యాట్రిజ్ సంస్థ వెల్లడించింది. బీజేపీకి 150–175 సీట్లు, టీఎంసీకి 118–138 సీట్లు లభిస్తాయని పీ–మార్క్ సంస్థ తెలిపింది. బీజేపీ 142–171 సీట్ల మధ్య గెలుచుకుని బెంగాల్‌లో అధికారంలోకి వస్తుందని, టీఎంసీకి 99–167 సీట్ల మధ్య లభిస్తాయని పోల్ డైరీ వెల్లడించింది. అయితే పీపుల్స్ పల్స్, జన్‌మత్ సంస్థలు తృణమూల్ 177-205 సీట్లు గెలుచుకుని మళ్లీ అధికారంలోకి వస్తుందని తెలిపాయి. మరోవైపు, తమిళనాడులో మెజార్టీ ఎగ్జిట్‌పోల్స్ డీఎంకే కూటమి అధికారంలోకి వస్తుందని అంచనా వేశాయి. ఈ రాష్ట్రంలో మొత్తం సీట్లు 234 కాగా.. కనీస మెజారిటీ 118. చాణక్య స్ట్రాటజీస్, పీపుల్స్ పల్స్, పీపుల్స్ ఇన్‌సైట్, ప్రజాపోల్, పీ–మార్క్, మ్యాట్రిజ్ సంస్థలు డీఎంకే, మిత్రపక్షాలు 120–168 సీట్ల మధ్య గెలుచుకుంటాయని పేర్కొన్నాయి. అన్నాడీఎంకే, మిత్రపక్షాలు 60–100 సీట్ల వరకు గెలుచుకోవచ్చని వెల్లడించాయి. సినీనటుడు విజయ్ ప్రభావం పెద్దగా ఉండబోదని సర్వే సంస్థలు తేల్చిచెప్పాయి. విజయ్‌కు 20 స్థానాలలోపే దక్కుతాయని పేర్కొన్నాయి.

ఎన్‌డీటీవీ -యాక్సిస్ మై ఇండియా సంస్థ మాత్రం విజయ్ నేతృత్వంలోని టీవీకే 98–120 సీట్లతో కింగ్‌మేకర్‌గా మారుతుందని, స్వయంగా అధికారంలోకి కూడా రావచ్చని తెలిపింది. రాష్ట్రంలో హంగ్ అసెంబ్లీ ఏర్పడుతుందని అంచనా వేసింది. కామాఖ్య ఎనలిటిక్స్ అనే సంస్థ కూడా 67–81 సీట్లతో టీవీకే కీలకపాత్ర పోషించనున్నట్లు తెలిపింది. మరో దక్షిణాది రాష్ట్రం కేరళలో పదేళ్ల తర్వాత కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ కూటమి అధికారంలోకి రానుందని దాదాపుగా అన్ని సర్వే సంస్థలూ తెలిపాయి. ఈ రాష్ట్రంలో మొత్తం అసెంబ్లీ స్థానాలు 140 కాగా అధికారం చేపట్టాలంటే కనీసం 71 గెల్చుకోవాలి. యూడీఎఫ్ 75–90 స్థానాలు గెలుస్తుందని, అ?ధికార ఎల్డీఎఫ్ 49–68 స్థానాలకు పరిమితమవుతుందని సర్వే సంస్థలు అంచనా వేశాయి.

# తుమ్మిడిహెట్టి 150 మీటర్లు..

### మహారాష్ట్రలో ముంపు లేకుండా బ్యారేజీ నిర్మాణం

### నేరుగా ఎల్లంపల్లికి గ్రావిటీతో 100 టీఎంసీల జలాలు

### కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అనుమతి ఇప్పించాలి

### ఉన్నత స్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

### కిషన్‌రెడ్డిని కలిసి కోరాలని మంత్రి ఉత్తమ్‌కు ఆదేశం

### తుమ్మిడిహెట్టి నుంచి శ్రీపాద ఎల్లంపల్లికి నీటి తరలింపునకు 4 ప్రత్యామ్నాయాలు: ఉత్తమ్



**హైదరాబాద్, ఏప్రిల్ 29:**
తుమ్మిడిహెట్టి బ్యారేజీని 150 మీటర్ల ఎత్తుతో నిర్మించడానికి వీలుగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. 152 మీటర్ల ఎత్తుతో కడితే మహారాష్ట్రలో ముంపు ఉంటుందని, మధ్యేమార్గంగా 150 మీటర్ల ఎత్తుతో నిర్మిస్తే ఆ ముంపు ఉండదని అధికారులు సీఎంకు తెలిపారు. పైగా, 100 టీఎంసీల గోదావరి జలాలను గ్రావిటీతో శ్రీపాద ఎల్లంపల్లికి తరలించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ బ్యారేజీకి అనుమతి సాధించేందుకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నుంచి సహకారం తీసుకోవాలన్నారు. ఇందు కోసం కిషన్‌రెడ్డికి లేఖ ఇవ్వాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి సూచించారు. బుధవారం ఎంసీఆర్‌హెచ్చార్డీ లోని క్యాంపు కార్యాలయంలో మంత్రి ఉత్తమ్, నీటిపారుదల శాఖ ఇంజనీర్లు, నిపుణులతో ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మిడిహెట్టి బ్యారేజీని ఎంత ఎత్తుతో కడితే ఏ మేరకు నీటిని తరలించేందుకు అవకాశం ఉంటుందనే దానిపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. 149.50 మీటర్ల ఎత్తుతో కడితే 108.58 టీఎంసీల మేర నీటిని తరలించవచ్చని, 150 మీటర్ల ఎత్తుతో కడితే 129.23 టీఎంసీల దాకా తరలించే వీలుంటుందని వివరించారు. దాంతో సీఎం స్పందిస్తూ.. 148 మీటర్ల ఎత్తు విషయంలో మహారాష్ట్ర ఇదివరకే అంగీకారం తెలిపినందున మళ్లీ సంప్రదింపులు చేయాల్సిన అవసరం లేదన్నారు. 148 మీటర్ల ఎత్తుతో కట్టినా, 150 మీటర్ల ఎత్తుతోనైనా ముంపులో తేడా ఉండదని అధికారులు గుర్తు చేయగా... 150 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ కట్టడానికి అవసరమైన కసరత్తు చేపట్టాలని ఆదేశించారు.

# రైతు సంక్షేమం గురించి మీరా చెప్పేది?

### హరీశ్ రావుకు విప్ బీర్ల అయిలయ్య బహిరంగ లేఖ

### నీచరాజకీయాలు చేస్తున్న హరీశ్: వేముల వీరేశం



**హైదరాబాద్, ఏప్రిల్ 29**
రైతు సంక్షేమం గురించి హరీశ్ రావుతో చెప్పించుకునే స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం లేదని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. కొద్దిరోజులుగా రైతులు పండించిన పంటలను ప్రభుత్వం శరవేగంగా కొంటున్న విషయం ఆయనకు కనిపించట్లేదా అని ప్రశ్నించారు. ఈ మేరకు బుధవారం హరీశ్‌రావుకు ఆయన బహిరంగ లేఖ రాశారు. ప్రభుత్వం ఇప్పటి దాకా 7,70,053 టన్నుల ధాన్యం, 3,46,121 టన్నుల మొక్కజొన్న, 30,220 టన్నుల శనగలు, 3,492 టన్నుల పొద్దు తిరుగుడు గింజలను కొనుగోలు చేసిందని వివరించారు. ధాన్యం కొన్న 48 గంటల్లో రైతుల ఖాతాలో డబ్బు జమచేయడమూ జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళు జరగట్లేదంటూ అబద్ధపు ప్రచారంతో హరీశ్ రావు నీచ రాజకీయాలు చేస్తున్నారని ప్రభుత్వ విప్ వేముల వీరేశం మండిపడ్డారు. హరీశ్‌రావు ఇంటిమందు.. ఆయనే సీసీ కెమెరాలు పెట్టించుకున్నారని, నిజంగా అవి హ్యాక్ అయి ఉంటే.. వాటిని అమర్చిన ఏజెన్సీదే బాధ్యత అవుతుందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్సేనని ఎంపీ మల్లు రవి అన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వస్తామంటూ బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కంటున్న కల.. పగటి కలగానే మిగిలిపోనుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# ఇక ప్రతి నెలా రూ.1000 కోట్లు!

### జీపీఎఫ్ బిల్లుల క్లియరెన్స్‌కు వినియోగం

### స్కాలర్‌షిప్‌ల సమస్యను పరిష్కరిస్తాం: భట్టి



**హైదరాబాద్, ఏప్రిల్ 29**
రాష్ట్రంలో ఉద్యోగుల బిల్లుల క్లియరెన్స్ కోసం ప్రతి నెలా విడుదల చేస్తున్న మొత్తాన్ని ప్రభుత్వం పెంచింది. ఇప్పటి వరకూ నెలకు రూ.700 కోట్లు విడుదల చేస్తుండగా.. దాన్ని రూ.1000 కోట్లు చేసింది. ఏప్రిల్ నెలకు సంబంధించి రూ.1000 కోట్లను విడుదల చేసింది. ఇకపై ప్రతి నెలా ఇంతే మొత్తం విడుదల చేస్తామని ప్రకటించింది. ఉద్యోగుల పదవీ విరమణ ప్రయోజనాలు, జీపీఎఫ్, టీజీఎల్ఐసీ, కమ్యూటేషన్, ఆర్జిత సెలవుల ఎన్క్ష?ష్మెంట్ వంటి పెండింగ్ బిల్లుల క్లియరెన్స్‌కు ప్రతి నెలా రూ.700 కోట్లను విడుదల చేస్తామని సర్కారు గత ఏడాది ప్రకటించింది. ఆ మేరకు 2025 ఆగస్టు నుంచి ప్రతి నెలా రూ.700 కోట్ల చొప్పున విడుదల చేస్తోంది. కానీ, దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న బిల్లుల చెల్లింపులకు అవి సరిపోవడం లేదని, నిధులు పెంచాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి రూ.1000 కోట్ల చొప్పున విడుదల చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారు. ఆయన ఆదేశాల మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఏప్రిల్‌కు సంబంధించిన రూ.1000 కోట్లను బుధవారం విడుదల చేశారు.

# మనది వికాసం.. వైసీపీది విధ్వంసం..

### ప్రత్యర్థి పార్టీ కుట్రలకు కాలం చెల్లింది: సీఎం

### చేసిన అభివృద్ధిని.. తెచ్చిన మార్పును.. పడిన కష్టాన్ని జనాలకు వివరిద్దాం!

### ఫ్లెక్సీలు, ఫొటోలు, కుర్చీల దగ్గర గొడవలొద్దు

### నాకు, పవన్ కల్యాణ్‌కు మధ్య మంచి అనుబంధం

### క్షేత్రస్థాయిలో రెండు పార్టీల నేతలూ ఇలాగే ఉండాలి

### కేంద్రంతో గ్యాప్ లేదు.. ముమ్మందు కూడా రాకూడదు

### సీనియార్టీ, సిన్సియార్టీ, సోషల్ రీ-ఇంజనీరింగ్‌తో కమిటీ కూర్పు, సమర్థత చూసే లోకేశ్‌కు పదవి

### టీడీపీ కార్యవర్గ ప్రమాణ స్వీకారంలో బాబు వెల్లడి



**అమరావతి, ఏప్రిల్ 29**
గొడ్డలి పార్టీ చేస్తున్న విధ్వంసాన్ని అనునిత్యం ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అధికారంలో ఉండగా రాష్ట్రాన్ని నాశనం చేసింది చాలక, ఇప్పుడు కూడా కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. కిల్లింగ్ మనస్తత్వంతో ఉన్న పార్టీకి సంక్షేమం పట్టదని, అభివృద్ధి అంటే గిట్టదని చంద్రబాబు దుయ్యబట్టారు. ప్రజలే మన పంథా అని ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకుని పనిచేయాలని స్పష్టం చేశారు. టీడీపీ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగింది. పొలిట్‌బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీలతో సీఎం చంద్రబాబు ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నిధులు తీసుకువస్తుంటే, వాటిని అడ్డుకునే ప్రయత్నం ప్రత్యర్థులు చేస్తున్నారని విమర్శించారు. వారు అడ్డుపడుతున్నా మనపై విశ్వాసంతో పెట్టుబడులు రాష్ట్రానికి పెద్దఎత్తున వస్తున్నాయన్నారు. ప్రత్యర్థి పార్టీ కుట్రలకు కాలం చెల్లిందని స్పష్టం చేశారు. “ఓసీడీ అనేది ఓ వ్యాధి. గొడ్డలి పార్టీకి ఇప్పుడు ఆవ్యాధి సోకింది. క్రెడిట్ చోరీ డిజార్డరుతో గొడ్డలి పార్టీ అనారోగ్యానికి గురైంది. వీళ్లని ఇలాగే వదిలేస్తే విశాఖకు గూగుల్‌నే కాదు, దేశానికి స్వాతంత్ర్యం కూడా తామే తెచ్చామని చెబుతారు. ఆపరేషన్ సిందూర్‌కు డ్రోన్లు తామే ఇచ్చామని ఆ పార్టీ చెప్పేలా ఉంది.” అని ఎద్దేవా చేశారు. “సొంత బాబాయిని హత్య చేసి నెపం మనపై నెట్టారు. వాళ్ల కార్యకర్తను కారుతో తొక్కించి ఆ పాపాన్ని మనపై మోపారు. నా జీవితంలో రాజకీయ నేతలతో పోరాడాను. తొలిసారిగా నేరస్థులతో పోరాడుతున్నాను. మనది అభివృద్ధి. వాళ్లది అవినీతి. మనది వికాసం. వాళ్లది విధ్వంసం. మనం రిలాక్స్ అయితే అబద్ధాలు ప్రపంచమంతా తిరుగుతాయి. అందుకే ప్రజలను నిత్యం అప్రమత్తం చేయాలి.” అని చంద్రబాబు వివరించారు. “తెలుగుదేశం పార్టీ అంటేనే క్రమశిక్షణ. కార్యకర్తల నుంచి అధ్యక్షుడి వరకు క్రమశిక్షణతో పనిచేయడం టీడీపీ మూల సిద్ధాంతం. ప్రజలతో సౌమ్యంగా వ్యవహరించాలి. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నేతలు ఉండాలి. నేతలు, కార్యకర్తలు తప్పు చేస్తే పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుంది. మనం సుపరిపాలనా యజ్ఞం చేస్తున్నాం. ఈ సమయంలో నేతలు సరిగా వ్యవహరించకుంటే బాధ కలుగుతుంది. ఎవరైనా అధికారం ఉందని ఇగోలకు పోతే భవిష్యత్తులో నష్టం జరుగుతుంది. చిన్నపాటి కలహాలు కూడా రాకూడదు. ప్రధాని పాల్గొనే కార్యక్రమంలో సెక్యూరిటీ తనకు అప్పగించిన పని తాను చేస్తుంది. దానికి నేను ఇగోకు వెళితే ఎలా? కీలక పదవుల్లో ఉన్నవారు తప్పు చేస్తే మీడియాలో హెడ్డింగ్‌లు వస్తాయి. పార్టీ క్రమశిక్షణను కూడా కాపాడాలి. వన్ టైమ్ ఎమ్మెల్యేలుగా ఉండొద్దు. మళ్లీ మళ్లీ ఎన్నిక కావాలి. అందరూ మనస్పర్థలు లేకుండా పనిచేయాలి. తాను లేకుండా ఎంపీ రాకూడదని ఎమ్మెల్యేలు అనడం సరికాదు. పార్టీ ఎవరికైతే టికెట్ ఇస్తుందో వారితోనే కార్యకర్తలు ఉంటారనేది ప్రతి నేత గుర్తుపెట్టుకోవాలి”.

# బెంగళూరులో వర్ష బీభత్సం

### ఏడుగురి మృతి.. 10 మందికి గాయాలు



**బెంగళూరు, ఏప్రిల్ 29**
బెంగళూరు నగరంలో అకాల వర్షం బీభత్సం సృష్టించింది. బుధవారం సాయంత్రం నగర వ్యాప్తంగా ఒక్కసారిగా ఈదురుగాలులతో వడగండ్ల వాన కురిసింది. వందలాది చెట్లు నేలకొరిగాయి. మెజస్టిక్ ప్రాంతంలోని రైల్వేస్టేషన్ వద్ద భారీ చెట్టు కూలడంతో పలు కార్లు ధ్వంసమయ్యాయి. ఈ వర్షానికి శివాజీ నగర్‌లోని బౌరింగ్ ఆసుపత్రి ప్రహరీ గోడ కూలిపోయింది.

ఆ శిథిలాల కింద చిక్కుకుని ఏడుగురు మృతిచెందారు. పదిమందికిపైగా గాయపడ్డారు. శివాజీ నగర్ బస్టాండ్ నుంచి సెయింట్ బసిలికా చర్చ్‌కు వెళ్లే ప్రధాన రహదారికి ఒకవైపు సుమారు 10 అడుగుల ఎత్తున ఈ ప్రహరీ ఉంది. ఇటీవలే దీని మరమ్మతు పనులు ప్రారంభించారు. ఈ క్రమంలో గోడకు ఓవైపు మట్టి ఉండటంతో వర్షపు ధాటికి అది కూలిపోయినట్లు భావిస్తున్నారు. ఫుట్‌పాత్ వ్యాపారులు ఎండ తీవ్రత నుంచి రక్షణ కోసం ప్రహరీ పైనుంచి షేడ్ వేసుకున్నారు. వర్షం కురుస్తున్న సమయంలో వ్యాపారులు, పాదచారులు వాటి కింద నిలబడిన సమయంలో ప్రమాదం జరగడంతో మరణాల సంఖ్య పెరిగింది. మృతుల కుటుంబ సభ్యులకు సీఎం సిద్దరామయ్య రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియాను ప్రకటించారు.

మన సమాజం
తెలుగు డిజిటల్ దినపత్రిక
గురువారం, ఏప్రిల్ 30, 2026

## పదవ తరగతి ఫలితాల్లో జిల్లా పరిషత్ బాలికల పాఠశాల విద్యార్థినుల ప్రభంజనం

లక్షెట్టిపేట ఏప్రిల్29(మన సమాజం)



మాటేటి రిషిక 567/600



మెడి తిరుమల 562/600

పదవ తరగతి ఫలితాల్లో జిల్లా పరిషత్ బాలికల పాఠశాల విద్యార్థినులు ప్రభంజనం సృష్టించారు ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా రాణించారు. లక్షెట్టిపేట విద్యార్థిని మాటేటి రిషిక 567/600 మార్కులతో మండలంలో ప్రథమ స్థానంలో , మేడి తిరుమల 562/600 మార్కులతో మండలంలో ద్వితీయ స్థానంలో నిలిచింది. 15 మందివిద్యార్థినులు500 మార్కులకు పైన ఫలితం సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి, శైలజ వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థినులకు అభినందించారు.

## చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి..

**రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి**



**రామకృష్ణాపూర్, ఏప్రిల్ 29, (మన సమాజం):**
విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. పట్టణంలోని సింగరేణి ఠాగూర్ స్టేడియంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న అస్మిత ఖేలో ఇండియా అండర్-16 ఫుట్బాల్ ఛాంపియన్ షిప్ పోటీల బహుమతుల ప్రధానోత్సవానికి బుధవారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ పోటీల్లో రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాల జట్లు పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు. గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేసి మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. కరీంనగర్ జట్టు మొదటి స్థానంలో నిలవగా, రెండవ స్థానంలో రంగారెడ్డి జట్టు, మూడవ స్థానంలో ఆదిలాబాద్, నిజామాబాద్ జట్లు నిలిచాయి. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ ఆటల్లో గెలుపోటములు సహజమని, ప్రతి క్రీడాకారులు క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగాలను సాధించడానికి స్పోర్ట్స్ సర్టిఫికెట్స్ దోహదపడతాయని తెలిపారు. ఎంతోమంది క్రీడాకారులను ఉన్నత శిఖరాలను చేర్చుతున్న సింగరేణి ఠాగూర్ స్టేడియంలో క్రీడాకారుల సౌకర్యార్థం మౌలిక సదుపాయాలను కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏరియా జిఎం రాధాకృష్ణ, బెల్లంపల్లి ఏసిపి కిరణ్ కుమార్, సిఐ రమేష్, ఏరియా ఆసుపత్రి డివైసిఎంఓ మధుకుమార్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఫుట్బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రఘునాథ్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు కట్ట ఈశ్వర చారి, నిర్వాహకులు పల్లె రాజు, ఓడ్నాల శ్రీనివాస్, పిఈటి లు దుబ్బ శ్రీనివాస్, బెల్లం శ్రీనివాస్ పాల్గొన్నారు.

## బిఆర్ఎస్వి నాయకుల అరెస్ట్..



**రామకృష్ణాపూర్, ఏప్రిల్ 29, (మన సమాజం):**
రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న 8వేల కోట్ల రూపాయల ఫీజు రియంబర్స్మెంట్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్వి కళాశాలల బంద్ పిలుపునిచ్చిన నేపథ్యంలో పట్టణ బిఆర్ఎస్వి నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేసి ఠాణాకు తరలించారు పోలీసులు. ఈ సందర్భంగా బిఆర్ఎస్వి జిల్లా అధ్యక్షులు బడికెల శ్రావణ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కమిషన్ల కోసం కాంట్రాక్టర్లకు బిల్లులను విడుదల చేస్తుంది తప్ప 20 లక్షలపైగా చదువుతున్న పేద విద్యార్థులకు మాత్రం ఫీజు రియాంబర్స్మెంట్ బిల్లులను విడుదల చేయలేదని మండిపడ్డారు. ఉన్నత చదువులకు వెళ్లే విద్యార్థులకు ఫీజులు చెల్లిస్తే గాని యాజామాన్యాలు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకపోవడంతో విద్యార్థులు మానసిక వేదనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అక్రమ అరెస్ట్ లకు భయపడే ప్రసక్తే లేదని, ఫీజులు విడుదల చేసే వరకు బిఆర్ఎస్వి ఆధ్వర్యంలో పోరాటలు చేస్తామని హేచ్చరించారు. అరెస్ట్ అయిన వారిలో నాయకులు జిలకర మహేష్, నస్పూరి శివకుమార్, కాంపెల్లి శ్రీకాంత్, కుర్మ దినేష్ ఉన్నారు.

## క్యాతనపల్లి మున్సిపాలిటీ మొదటి సాధారణ కౌన్సిల్ సమావేశం

**36 అంశాలను ప్రతిపాధించిన సభ్యులు**






**రామకృష్ణాపూర్, ఏప్రిల్ 29, (మన సమాజం):**
మున్సిపాలిటీలో మొదటి కౌన్సిల్ సాధారణ సమావేశం బుధవారం నిర్వహించారు. ఛైర్మెన్ గోడిశెల సంధ్యారాణి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో 36 అంశాలను ప్రతిపాదించగా గౌరవ కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. రాబోయే వర్షాకాలంను దృష్టిలో పెట్టుకొని బిజోన్ నుండి విద్యానగర్ వరకు రెండు కోట్ల రూపాయలతో డ్రైన్ నిర్మాణం, ఆరు కోట్ల రూపాయల వ్యయంతో నూతన పురపాలక సంఘం భవనం నిర్మాణంతో పాటు , సింగరేణి స్థలంలో ఇండ్లు నిర్మించుకున్న వారికి జీవో నెంబర్ 76 ప్రకారం పెండింగ్ లో ఉన్న పట్టాలని ఇవ్వడం వంటి ప్రధాన అంశాలపై చర్చించారు. మే 11వ తేదీ నుండి జూన్ 9వ తేదీ వరకు నిర్వహించే జనాభా గణన సర్వేకు పురపాలక ప్రజలు సహకరించాలని అధికారులు, గౌరవ సభ్యులు కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, వైస్ చైర్మన్ మిట్టపల్లి సరిత, ఇంచార్జ్ మేనేజర్ సతీష్, అధికారులు ఆశ్రిత్, రాజ్ కుమార్, సుమతి పాల్గొన్నారు.

## కోరుట్లలో నారి శక్తి 100 ఆదినీయంపై మహిళా ఆక్రోశ సమ్మేళనం



**కోరుట్ల టౌన్ ఏప్రిల్ 29**
మహిళా రిజర్వేషన్ బిల్లు నారీ శక్తి వందన్ ఆదినీయం పై కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న రాజకీయాలకు నిరసనగా ఈనెల గురువారం ఏప్రిల్ 30వ తేదీన సాయంత్రం నాలుగు గంటలకు రుట్ల పట్టణంలోని కటకం సంగయ్య ఫంక్షన్ హాల్ లో బిజెపి మహిళా మోర్చా ఆధ్వర్యంలో మహిళ ఆక్రోష సమ్మేళనం నిర్వహించనున్నట్లు బిజెపి జిల్లా అధ్యక్షులు రాచకొండ యాదగిరి బాబు తెలిపారు ఈ సమావేశనికి మాజీ శాసనసభ్యురాలు డాక్టర్ శ్రీదేవి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించనున్నారు జగిత్యాల అసెంబ్లీ ఇన్చార్జి బోగ శ్రావణి వని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ అనుపు రావు రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పూదరి అరుణ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు రుద్ర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు మహిళలకు 33% రిజర్వేషన్ విషయంలో దశాబ్దాలు ఆలస్యం చేసి ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం చట్టం తీసుకురాగానే అడ్డంకులు సృష్టిస్తున్న పార్టీల ద్వంద వైఖరిని ప్రజలకు తెలియజేయడం మహిళలకు న్యాయం చేయడానికి వ్యతిరేకించిన పార్టీలకు గుణపాఠం చెప్పడమే ఈ సమ్మేళనం ప్రధాన ఉద్దేశం అని బిజెపి నేతలు పేర్కొన్నారు జిల్లాలోని మహిళా మోర్చా నాయకురాళ్ళు కార్యకర్తలు వివిధ రంగాలకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు

## పదో తరగతి ఫలితాల్లో బీసీ గురుకుల విద్యార్థుల విజయదుందుభి

**- 98.99శాతం ఉత్తీర్ణత , రెండో స్థానంలో బీసీ గురుకులాలు**

**- 204 పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత - 580 కన్న ఎక్కువ మార్కులు సాధించిన 60**

**- విద్యార్థులను అభినందించిన బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**

**, ముఖ్య కార్యదర్శి బాల మాయాదేవి, ఎంజేపి కార్యదర్శి బడుగు సైదులు**



**కోరుట్ల టౌన్ ఏప్రిల్ 29**
మన రాష్ట్రశీ లో ఈరోజు విడుదల అయినా పదవ తరగతి ఫలితాలలో మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల సంస్థ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించి విజయఢాంకా మోగించారు.అత్యధిక మార్కులు 588 ఇద్దరు బాలికలు నితీషా, శ్రీనిధి సాధించగా, 587 మార్కులు సాయి మనోజ్ రెడ్డి, లాస్య సాధించి తమ ప్రతిభను చాటారు. ఈ ఏడాది బీసీ గురుకుల విద్యార్థులు 98.99 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్ర సగటు కంటే 4.84 ఎక్కువ ఉత్తీర్ణత శాతం నమోదు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 294 పాఠశాలల నుంచి 204 పాఠశాలలు వందశాతం ఉత్తీర్ణత సాధించాయి. 60 విద్యార్థులు 580 కంటే ఎక్కువ మార్కులు సాధించగా 570 కంటే ఎక్కువ మార్కులు 364మంది విద్యార్థులకు రాగా , 560 కంటే ఎక్కువ మార్కులు 1061 మంది విద్యార్థులు సాధించి తమ ప్రతిభను చాటారు. 3598 మంది విద్యార్థులు 90శాతం పైగా మార్కులతో తమ సత్తా చాటారు. ఈ ఏడాది 19,245మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 19,047 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వారిలో 9,093 మంది బాలురు, 9,954 మంది బాలికలు ఉన్నారు.

**బీసీ సంక్షేమ వసతి గృహాల ఉత్తీర్ణత శాతం 96.05**
రాష్ట్రంలోని బీసీ వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులు ఈ ఏడాది పదోతరగతి ఫలితాల్లో మెరుగైన ఫలితాలు సాధించారు. రాష్ట్రంలో ప్రీ-మెట్రిక్ బీసీ హాస్టల్స్ 365 నుంచి పదో తరగతి పరీక్షలకు 4941 మంది విద్యార్థులు హాజరుకాగా వారిలో 4746 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడంతో బీసీ సంక్షేమ వసతి గృహాల ఉత్తీర్ణత శాతం 96.05గా నమోదు అయ్యింది. ఇందులో 285 వసతి గృహాల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. అన్ని జిల్లాల లోని హాస్టల్స్ 90 శాతం కన్న ఎక్కువ ఉత్తీర్ణత సాధించగా ఆదిలాబాద్, హైదరాబాద్ , ములుగు జిల్లాలు 100శాతం ఫలితాలను సాధించాయి. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను , బోధనా సిబ్బందిని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ముఖ్య కార్యదర్శి బాల మాయాదేవి, బీసీ గురుకుల సోసైటీ కార్యదర్శి బడుగు సైదులు గారు అభినందించారు.

## ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం



**జగిత్యాల, ఏప్రిల్ 29**
జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ప్రజా సమస్యల పరిష్కారమే తెలంగాణ జన సమితి పార్టీ లక్ష్యం అని అ పార్టీ రైతు విభాగ రాష్ట్ర అధ్యక్షులు కోరుట్ల నియోజకవర్గం ఇంచార్జ్ కాంతి మోహన్ రెడ్డి అన్నారు పార్టీ 8 వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా బుధవారం రోజున ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ లో తెలంగాణ జన సమితి పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కాంతి మోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యల పై పోరాటంలో పార్టీ ముందు ఉంటుంది అని నిరంతరం ప్రజా సమస్యల పై విద్యార్థి - నిరుద్యోగ సమస్య పై పోరాటం చేస్తున్న ఏకైక పార్టీ తెలంగాణ జన సమితి పార్టీ అని రైతుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా రైతుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న పార్టీ అని అన్నారు ఈ కార్యక్రమంలో టిజెయస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకుంట శంకర్ ఇబ్రహీంపట్నం మండలం అధ్యక్షులు కాంతి రమేష్,మాజీ ఎంపిటిసి రాజా రెడ్డి,రెబ్బటి మలయ్య కనక మహేష్, బద్ది రాములు జిల్లా రాజేందర్, కాంతి సంజీవ్,గుమ్మడి నర్సయ్య,లాడే రాజేందర్,తదితరులు పాల్గొన్నారు

# ఈ మానసిక దాస్యం నుంచి విముక్తి ఎప్పుడు?

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ ఏప్రిల్ 18న జాతి నుద్దేశించి ప్రసంగించారు. మన ప్రజాస్వామ్యంలో అత్యున్నత రాజకీయ స్థానంలో ఉన్న నాయకుడు ప్రధానమంత్రి. కనుకనే మనలో చాలా మందికి ఆ ప్రభావదాయక వ్యక్తి ప్రసంగం ఒక అత్యవసరమైన సందేశాన్ని సూచిస్తుంది. రాష్ట్రపతి కూడా కొన్ని సందర్భాలలో జాతి నుద్దేశించి ప్రసంగిస్తారు. అయితే అవి కేవలం లాంఛన ప్రాయంగా చేసే ప్రసంగాలే. ప్రధానమంత్రి ప్రసంగాలు భిన్నమైనవి. దేశం ఒక సంక్షోభం ముంగిట ఉన్నప్పుడో లేదా దేశ పౌరులలో ప్రతి ఒక్కరి జీవితాన్ని ప్రభావితం చేసే విధాన నిర్ణయం తీసుకున్నప్పుడో ప్రధానమంత్రి జాతి జనుల నుద్దేశించి ప్రసంగిస్తారు. పెద్ద విలువగల కరెన్సీ నోట్లను రద్దు చేస్తున్న విషయాన్ని నవంబర్ 8, 2016 రాత్రి ఎనిమిది గంటల సమయంలో దేశ ప్రజలకు ప్రధానమంత్రి తెలియజేయడాన్ని, అలాగే మార్చి 24, 2020న దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ అమలుపరుస్తున్నట్టు ప్రకటించడాన్ని ఎవరు మరచిపోగలరు? ఈ కారణంగానే ప్రధానమంత్రి జాతిని ఉద్దేశించి ప్రసంగిస్తున్నారంటే ఆ ప్రసంగ విషయానికి ఎంతో ప్రాధాన్యముంటుంది, ఆ విషయ అత్యావశ్యకతను అది సూచిస్తుంది. అయితే ఈ నెల 18న దేశ ప్రజలను ఉద్దేశించి ప్రధాని మోదీ చేసిన ప్రసంగానికి అటువంటి ప్రాధాన్యమేదీ లేదు. భారత జాతీయ పతాకం వెనుక ఉండగా వెలువరించిన ప్రసంగంలో మహిళా రిజర్వేషన్‌ను ప్రతిపక్షాలు అడ్డుకున్నాయని ఆయన ఆరోపించారు. నిజానికి డీలిమిటేషన్ (నియోజక వర్గాల పునర్విభజన)తో మహిళలకు మరిన్ని సీట్లు కేటాయించే అంశంతో ముడిపెట్టిన రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026 పార్లమెంటు ఆమోదం పొందలేకపోయింది. చట్టసభలలో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంపొందించే ప్రయత్నంలో తమ ప్రభుత్వం విఫలమయినందుకు భారత మహిళలకు ఆయన క్షమాపణలు చెప్పారు. ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ ఆ ప్రసంగం చేయడం ఒక అసాధారణమైన విషయం. రెండు కీలక రాష్ట్రాల శాసనసభ ఎన్నికలు జరగనుండగా ఆయన ఆ ప్రసంగం చేశారు. ఎన్నికల నిబంధనల మేరకు ప్రధానమంత్రిగా ఆయన ఆ ప్రసంగం చేయకూడదు. అయితే భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మోదీపై ఎలాంటి చర్య తీసుకోకపోగా నామమాత్రంగానైనా ఆక్షేపణ తెలుపలేదు. సరే, మోదీ ఆ ప్రసంగం చేయడం ద్వారా తాను నిర్వహిస్తున్న అత్యున్నత పదవి రాజకీయ హుందాను కళంకపరిచారు. ఎటువంటి వాదనలూ ఆయన ఆ ప్రసంగాన్ని చేయడాన్ని న్యాయసమ్మతం చేయలేవు. నరేంద్ర మోదీ చర్యలో రాజకీయ నైతికతను అలా ఉంచితే ఆయన ప్రసంగానికి దేశ పౌరుల ప్రతిస్పందన నాకు అమిత ఆసక్తి గొలుపుతోంది. దానిని నిశితంగా పరిశీలించవలసిన అవసరమున్నది. మన రాజ్యాంగంపై అవగాహన ఉన్న కొద్ది మంది పౌరులు, ప్రధానమంత్రిగా మోదీ ఆ ప్రసంగం చేయడాన్ని ఆక్షేపిస్తూ ఈసీఐకి లేఖలు రాశారు. సామాజిక మాధ్యమాలలో మోదీ చర్యపై ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. మోదీ ప్రసంగాన్ని తప్పుపట్టినవారు ఎంతో మంది లేరని చెప్పడం సత్యదూరమేమీ కాదు. ఆయన తన అభిప్రాయాన్ని ప్రజలకు నివేదించారని, ప్రధానమంత్రి కనుక ఆయన ఆ అధికార స్థానం నుంచి దేశ ప్రజలతో సంభాషించారని చాలా మంది భావించారు. ప్రధానమంత్రిగా ఆయన ఆ ప్రసంగం చేయడం తప్పు అనే మౌలిక సత్యాన్ని దేశ పౌరులు గుర్తించలేదు. రాజకీయాల పట్ల మన నిబద్ధత, బాధ్యత గురించి ఇది ఏమి చెబుతుంది? అధికారంతో మన సంబంధాలు ఏమిటి అనేది ప్రస్తుత సందర్భంలో చాలా సముచితమైన ప్రశ్న అని నేను భావిస్తున్నాను. అధికారం ప్రజలపై, ముఖ్యంగా భారతీయులపై విద్ధూరమైన ప్రభావాన్ని నెరపడం కద్దు. అధికారంలో ఉన్నవారికి విధేయులుగా ఉండేలా వ్యవహరించేలా మన సామాజిక వ్యవస్థ మనలను తీర్చిదిద్దుతోంది. పాలకులకు ప్రశ్నలు సంధించేవారు సైతం ఈ దాస్యతత్వాన్ని రక్త గతం చేసుకున్నవారే కావడం గమనార్హం. ప్రశ్నించడమనేది అధికారం ద్వారా నియంత్రితమవుతోంది. ఇప్పటికే అధికారంలో ఉన్న శ్రేణులు యథాతథంగా కొనసాగేలా మాత్రమే ఆ ప్రశ్నల తీరుతెన్నులు ఉండేలా అధికారంలో ఉన్నవారే నిర్దేశించడం జరుగుతోంది. మరింత స్పష్టంగా చెప్పాలంటే అధికారంలో ఉన్నవారికి ఇబ్బంది కలిగించే ప్రశ్నలు వేసేందుకు అనుమమతించరు. ప్రస్తుత అధికార అసమతౌల్యతలు మరింత దృఢమయ్యేలా మాత్రమే ప్రశ్నించే వైఖరులు ఉండితీరాలి. అసలు అధికారంలో ఉన్నవారి చర్యలు, నిర్ణయాలను నిశితంగా ప్రశ్నించాలన్న ఆలోచనే చాలా మందికి ఉండదు. ప్రశ్నించినా సహేతుకమైన, సబబైన సమాధానాలను వారు డిమాండ్ చేయరు. ఒకరి అదుపాజ్ఞలలో ఉండడం, చెప్పింది చేయడమే చాలా సహజ విషయంగా మన సమాజంలో పరిగణన పొందుతోంది. తమిళ మహాకవి సుబ్రమణ్య భారతి ఈ మనోవైఖరిని ఆక్షేపించారు. 'బానిసత్వంలోనే ఉండిపోవాలనే ఆరాటానికి మనం ఎప్పుడు స్వస్తి చెప్పుతాం?' అని ఆయన ప్రశ్నించారు. వలస పాలన కాలంలో ఆయన ఈ ప్రశ్న వేసినప్పటికీ, ఇప్పటికీ ఎంతో ఉపయుక్తత ఉన్న విషయమది. ఎందుకని? మానసిక దాస్యం అనేది మనలో ఇప్పటికీ నిండుగా ఉన్నది. ఈ కారణంగానే మనం మన నాయకులకు గుడ్డి విధేయత చూపుతున్నాం. ఏకీభవించనప్పుడు మౌనంగా ఉండిపోతున్నాం! ఇది మనకు తాతల తరం నుంచి వస్తున్న అలవాటు. దాన్ని కొనసాగించడమే సుఖప్రదంగా మనకు కనిపిస్తోంది. నిచ్చెనమెట్ల కుల వ్యవస్థ భూస్వామ్య, పితృస్వామ్య భావజాలాలు ఈ మానసిక దాస్యాన్ని మరింతగా దృఢతరం చేస్తున్నాయనేది ఒక నిష్ఠుర సత్యం. సరే, ప్రధాని మోదీ రాజ్యాంగ నైతికతకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు అనేది విద్యాధికులు మాత్రమే పట్టించుకునే సమస్య అని, సామాన్యులు ఎవరూ తమ నాయకులు రాజకీయ మర్యాదలు పాటిస్తున్నారా లేదా అనే విషయాన్ని లక్ష్యపెట్టరనే వాదన ఒకటి గట్టిగా ఉన్నది. ఇది ప్రమాదకరమైన వాదన. దీని ప్రకారం పేదలు, అణగారిన వర్గాలవారు రాజకీయ ఔచిత్యాన్ని పట్టించుకోరని, రాజకీయాల గురించి వివేకశీలంగా ఆలోచించగల సామర్థ్యం వారికి లేదని భావించవలసి వస్తుంది. ఇదెంతవరకు నిజం? మధ్యతరగతి, ఉన్నత మధ్యతరగతి వర్గాలు జీవన సౌఖ్యాల గురించే ఎక్కువగా ఆలోచించడం పరిపాటి. పేద ప్రజల ఆలోచనలు భిన్నంగా ఉంటాయి. వారు కేవలం ఉపాధి, తిండి, గూడు గురించి మాత్రమే ఆందోళనపడరు. జీవన యాతనలకు కేవలం ఆర్థిక ఉపశమనానికి పరిమితం కాని సంపూర్ణ స్వేచ్ఛ గురించి వారు కలలుగంటారు. స్వయంప్రతిపత్తితో తమ జీవితాలను తామే నిర్ణయించుకోగల సామర్థ్యం కోసం ఆరాటమే వారి స్వేచ్ఛా స్వప్నం. పరిపూర్ణ స్వేచ్ఛకై తమ ఆరాటాన్ని ఆంగ్ల విద్యావంతుల వలే వారు స్పష్టంగా వ్యక్తీకరించలేక పోవచ్చు గానీ, ఆ సమగ్ర స్వేచ్ఛను ఆ విద్యాధికులు అర్థం చేసుకోలేని రీతుల్లో వారు అవగాహన చేసుకుంటారు. అంతేగాదు, స్వేచ్ఛను సమకూర్చుకునేందుకు పేదలు చూపే చొరవ శక్తిమంతమైనది. మధ్యతరగతి, ఉన్నత మధ్యతరగతి ప్రజల ఉత్సుకత కంటే అది చాలా బలీయమైనది. ఇదిగో, ఈ కారణంగానే అధికారంలో ఉన్నవారు ఆ పరిపూర్ణ స్వేచ్ఛా స్వాప్నికులను, అంటే పేదలను సదా తమ నియంత్రణలో ఉంచుకునేందుకు తాము చేయగలిగినదంతా చేస్తుంటారు.. మరీ ముఖ్యంగా తాము అనుమతించిన ఆలోచనా రీతులకు భిన్నమైన సరళిలో పేదల ఆలోచనలు సాగేందుకు ససేమిరా అంగీకరించరు. అణగారిన వర్గాల వారికి అధికారం కొరవడడానికి కారణమేమిటి? స్వేచ్ఛ కోసం వారు చేస్తున్న పోరాటాన్ని అమల్లో ఉన్న సామాజిక సంప్రదాయాలు, రాజకీయ ఆధిపత్యాలు అపరిమితంగా కష్టతరం చేయడమే కాదూ? ప్రభుత్వాలకు కఠినమైన ప్రశ్నలు సంధించడంలో వైఫల్యానికి నిజమైన బాధ్యులు సామాజికంగా విశేషాధికారాలు అనుభవిస్తున్న వారేనని నిక్కచ్చిగా చెప్పితీరాలి. జీవన సౌఖ్యాలు నిరంతరం అందుబాటులో ఉన్న సామాజిక శ్రేణులివి. తాత, ముత్తాతల కాలం నుంచీ జీవితం ఒక పండుగలా గడుస్తుండడంతో అధికారంలో ఉన్న వారి పట్ల విధేయతతో వ్యవహరించడం ఈ సామాజిక వర్గాలకు ఒక స్వతస్సిద్ధ లక్షణంగా మారింది. సమాజంలో అట్టడుగున ఉన్నవారితో పోల్చి చూసినప్పుడు ఈ సామాజిక వర్గాలలో చాలా మంది జీవన సౌఖ్యాలకు నోచుకుంటున్నవారే. వారి ఆర్థిక బలిమి కంటే సామాజిక ప్రభావప్రాబల్యాలు చాలా చాలా అధికం. కనుకనే జీవన మనుగడకు ముఖ్యమైన స్వేచ్ఛను వారు లక్ష్యపెట్టరు. కేవలం ఆర్థికాభ్యుదయం పరంగానే 'స్వేచ్ఛ' గురించి వివేచిస్తారు. ఆ సమున్నత ఆదర్శాన్ని ఆర్థిక ఉన్నతి కోసం ఉపయోగించుకుంటారు. సామాజిక పురోగతి, రాజకీయ ప్రగతి, సృజనాత్మకత పరంగా స్వేచ్ఛను అర్థం చేసుకోవడం సామాజిక విశేషాధికారాలతో అలరారుతున్న వారికి దాదాపుగా అసాధ్యమైపోతోంది. శక్తిమంతమైన సామాజిక వర్గాలు తమ ఆర్థిక బలిమికి మరింతగా దోహదం చేసే విద్యా నమూనాలను రూపొందించి అమలుపరుస్తూ లబ్ధి పొందుతున్నాయి. సమస్త సామాజిక వ్యవస్థలు, నిర్మాణాలను ప్రభావితం చేయగల సామర్థ్యం ఈ కులీన వర్గాలకు ఉన్నందున వారి జీవన స్థితిగతులు సమాజంలోని సమస్త శ్రేణులకు ఆకాంక్షాత్మకమయ్యాయి. ఈ పరిస్థితిలో మోదీ రాజకీయ ప్రవర్తనాసరళి మన మనసులను గాయపరిచేదిగా, మన అవగాహనను వక్రీకరించేదిగా, మన అభిప్రాయాలను ప్రభావితం చేసేదిగా ఉంటోంది. మరీ ముఖ్యంగా రాజకీయ నైతికతను అసంగతం చేస్తోంది. సామాజిక అంతరాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలూ కలిసికట్టుగా ప్రభుత్వానికి ఇబ్బందికరమైన ప్రశ్నలు సంధించాలి, ప్రజాప్రతినిధులను జవాబుదారీగా ఉంచాలి; రాజకీయ ప్రవర్తనా రీతులు అత్యున్నత ప్రమాణాలకు అనుగుణంగా ఉండితీరాలని డిమాండ్ చేయాలి. పౌర భాగస్వామ్యం ఇంత క్రియాశీలకంగా ఉంటేనే ప్రజాస్వామ్యం సజీవంగా ఉంటుంది.

# ముగిసిన బెంగాల్ ఎన్నికలు

**రెండో దశలో 91.66 శాతం పోలింగ్..**

**నాలుగోసారి అధికారం మాదే: తృణమూల్**



**కోల్‌కతా, ఏప్రిల్ 29:**
పశ్చిమ బెంగాల్‌లో బుధవారం రెండో దశ పోలింగ్‌తో ఎన్నికలు ముగిశాయి. తొలిదశతో (93.19్న) పోటీ పడుతూ ఈ దశలో కూడా భారీగా 91.66 శాతం నమోదైంది. రెండు దశల్లో కలిపి 92.47 శాతం పోలింగ్ జరిగిందని ఎన్నికల సంఘం ప్రకటించింది. స్వాతంత్ర్యానంతరం పశ్చిమ బెంగాల్‌లో జరిగిన ఎన్నికల్లో ఇదే అత్యధికమని తెలిపింది. ఈ నెల 23వ తేదీన తొలి విడత పోలింగ్ బీజేపీకి గట్టి పట్టున్న ఉత్తర బెంగాల్‌లో జరగగా.. మలి విడత తృణమూల్‌కు పట్టున్న దక్షిణ బెంగాల్‌లో జరిగింది. రెండో దశ ఎన్నికలు జరిగిన 142 నియోజకవర్గాల్లో ఏకంగా 123 తృణమూల్ సిట్టింగ్ స్థానాలు కావటం విశేషం. భారీగా నమోదైన పోలింగ్ తమకు అనుకూలం అంటే తమకు అనుకూలం అని వైరిపక్షాలు రెండూ ప్రకటించుకున్నాయి. మమత ప్రభుత్వం చేపట్టిన పలు సంక్షేమ పథకాలతో తమకు తిరిగి పట్టం కట్టటానికి ఓటర్లు భారీ ఎత్తున తరలివచ్చారని తృణమూల్ పేర్కొనగా.. ఇది మమత ప్రభుత్వానికి వ్యతిరేక ఓటు అని, అధికారంలోకి తామే రాబోతున్నామని బీజేపీ తెలిపింది. 71 ఏళ్ల మమతా బెనర్జీ వరుసగా మూడుసార్లు తృణమూల్ కాంగట?్రసను అధికారంలోకి తీసుకొచ్చి గత 15 ఏళ్లుగా ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఈసారి గెలిస్తే నాలుగోసారి విజయం సాధించినట్లవుతుంది.

## సీఆర్‌పీఎఫ్ బలగాలపై మమత ధ్వజం

ఎప్పుడూ మధ్యాహ్నం వేళల్లో పోలింగ్‌బూత్‌కు వెళ్లి ఓటు వేసే మమత ఈసారి అందుకు భిన్నంగా బుధవారం ఉదయం 8 గంటలకే తాను పోటీ చేస్తున్న భవానీపూర్ నియోజకవర్గంలో ఓ పోలింగ్‌బూత్‌కు వెళ్లి ఓటు హక్కు వినియోగించుకున్నారు. విధుల్లో ఉన్న సీఆర్‌పీఎఫ్ బలగాలు తమను పోలింగ్ బూత్‌ల వద్ద ఉండకుండా చెదరగొడుతున్నారన్న తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్తల ఫిర్యాదుల మేరకు పలు బూత్‌ల పరిధిలో మమత పర్యటించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ, బెంగాల్‌లో ఎన్నికల కోసం ఎన్నికల సంఘం భారీ ఎత్తున మోహరించిన సీఆర్‌పీఎఫ్ దళాల పనితీరుపై విరుచుకుపడ్డారు. రెండో దశ పోలింగ్‌కు ముందురోజు రాత్రి నుంచి తమ పార్టీ కార్యకర్తల్ని అదుపులోకి తీసుకున్నారని, కోర్టు ఆదేశాలున్నా లెక్కచేయకుండా అరెస్టులు చేశారని ఆరోపించారు. అనేక నియోజకవర్గాల్లో పోలింగ్ బూత్‌ల వద్ద లాఠీచార్జి జరిపి మహిళలు, వృద్ధులు, పిల్లల మీద కూడా చేయి చేసుకున్నారని తెలిపారు. పోలింగ్‌బూత్‌ల వద్ద రాష్ట్ర పోలీసులకు డ్యూటీలు ఇవ్వకుండా.. అన్ని బూత్‌లను సీఆర్‌పీఎఫ్ దళాలే ఆక్రమించాయని, ఏ ఒక్క బూత్ కూడా సురక్షితంగా లేదన్నారు. కేంద్ర బలగాలను ఉపయోగించి బెంగాల్ ఎన్నికల్ని రిగ్గింగ్ చేయాలని బీజేపీ కుట్రలు చేస్తోందని, ప్రజాస్వామ్యంలో ఇటువంటి ఘటనలు తాను ఎన్నడూ చూడలేదని చెప్పారు. బీజేపీ ఎన్ని అడ్డంకులు సృష్టించినా మళ్లీ తామే గెలవబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. భవానీపూర్‌లో మమతపై బీజేపీ నుంచి ఆ పార్టీ కీలక నేత సువేందు అధికారి బరిలో ఉన్నారు. ఓ పోలింగ్ బూత్ వద్ద మమత ఉన్నప్పుడు సువేందు కూడా అక్కడికి వచ్చారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మరోవైపు, ఫాల్తా అనే నియోజకవర్గంలోని మూడు పోలింగ్‌బూత్‌లలో ఈవీఎంలపై బీజేపీ, సీపీఎం అభ్యర్థుల పేర్లు, ఎన్నికల చిహ్నాలు కనిపించకుండా టేప్ అతికించారని బీజేపీ ఐటీ విభాగం అధిపతి, ఆ పార్టీ బెంగాల్ ఇంచార్జి అమిత్ మాలవీయ ఆరోపించారు. ఈ మేరకు ఆన్‌లైన్‌లో కొన్ని వీడియోలు కూడా కనిపించాయి. మరికొన్ని బూత్‌లలో ఈవీఎంలపై తన పేరుకు సంబంధించిన బటన్ పని చేయలేదని బీజేపీ అభ్యర్థి ఆరోపించారు. దీనిపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ స్పందిస్తూ.. ఈ ఆరోపణల మీద విచారణ జరిపిస్తామని, వాస్తవమని తేలితే రీపోలింగ్‌కు ఆదేశాలు జారీ చేస్తామన్నారు.

## ఎస్ఐఆర్ ప్రభావం

బెంగాల్‌లో చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా.. దక్షిణ బెంగాల్‌లోని పలు నియోజకవర్గాల్లో కొన్ని లక్షల మంది పేర్లను ఈసీ తొలగించింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో 25 స్థానాల్లో విజేతలకు లభించిన మెజారిటీ కన్నా ఈసారి అక్కడ తొలగించిన ఓట్లే ఎక్కువగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో, ఈసారి ఫలితాల అనంతరం విజేతల మెజారిటీ చాలా తక్కువగానే ఉండే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు మే 4వ తేదీన వెలువడనున్నాయి. కాగా, పశ్చిమ బెంగాల్ ఓటర్లు ఈసారి నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని ప్రధాని మోదీ తెలిపారు. తుదిదశ పోలింగ్‌లో భారీ సంఖ్యలో ఓటర్లు పాల్గొనడాన్ని ఆయన ప్రస్తావించారు.

# ఇక సర్కారు మెట్రో... ఎల్ అండ్ టీతో పూర్తయిన ఒప్పందం

**రూ.1,461.47 కోట్ల విలువైన వంద శాతం షేర్ల బదిలీ**

**రూ.13,538.53 కోట్ల అప్పు ప్రభుత్వ హామీతో రీఫైనాన్స్**



**హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 29**
ఇప్పటివరకు ఎల్ అండ్ టీ ఆధీనంలో ఉన్న హైదరాబాద్ మెట్రో రైలును రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. మెట్రో ఫేజ్-1ను హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్) ద్వారా స్వాధీనం చేసుకోవాలని సర్కారు గతంలోనే నిర్ణయించింది. ఈ మేరకు ఎల్ అండ్ టీతో కొద్దిరోజులుగా సంప్రదింపులు జరుపుతోంది. ఈ క్రమంలోనే బుధవారం సచివాలయంలో హెచ్ఎంఆర్ఎల్ ఛైర్మన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, మెట్రోపాలిటన్ ఏరియా, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్, మెట్రో ఎండీ సర్ఫరాజ్ అహ్మద్,ఎల్ అండ్ టీ, ఎల్‌టీఎంఆర్ హెచ్ఎల్ ప్రతినిధులు సమావేశమయ్యారు. ఎల్ అండ్ టీ, ఎల్‌టీఎంఆర్‌హెచ్ఎల్ లిమిటెడ్ సంస్థలతో షేర్ల కొనుగోలు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ మేరకు ఎల్‌టీఎంఆర్‌హెచ్ఎల్‌కు ఉన్న వంద శాతం షేర్లను రూ. 1,461.47 కోట్ల ఈక్విటీ విలువకు ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఒప్పందంపై హెచ్ఎంఆర్ఎల్ తరఫున ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, ఎల్అండ్‌టీ తరఫున డీకే సేన్, ఎల్‌టీఎంఆర్‌హెచ్ఎల్ తరఫున కేవీబీ రెడ్డి సంతకాలు చేశారు. అలాగే ఈ ఒప్పందం ప్రకారం ఎల్ అండ్ టీ హామీతో ఎల్‌టీఎంఆర్‌హెచ్ఎల్‌పై ఉన్న రూ. 13,538.53 కోట్ల అప్పును (2026 ఏప్రిల్ 30వ తేదీ నాటికి) తెలంగాణ ప్రభుత్వ హామీతో రీఫైనాన్స్ చేస్తారు. ఈ లావాదేవీకి ట్రాన్సాక్షన్ అడ్వైజర్‌గా ఐడీబీఐ క్యాపిటల్ వ్యవహరించగా, లీగల్ అడ్వైజరీ సేవలను సరఫ్ అండ్ పాట్నర్స్ సంస్థ అందించింది. హైదరాబాద్‌లో ఎల్ అండ్ టీ మెట్రో రైల్ లిమిటెడ్ సంస్థ 2017 నవంబరు నుంచి మూడు కారిడార్లలో మొత్తం 69 కి.మీ. నెట్‌వర్క్‌తో హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-1ను నిర్వహిస్తోంది. మెట్రోలో ప్రస్తుతం రోజుకు సుమారు 4.50 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. మెట్రో ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు సుమారు 86 కోట్ల ప్రయాణాలు నమోదయ్యాయి. హైదరాబాద్ మెట్రో ఫేజ్-1ను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడంతో ఫేజ్-1, ప్రతిపాదిత ఫేజ్-2 నెట్‌వర్క్ రూపకల్పన, పనులు, ప్రణాళిక, అమలు, మెరుగైన సేవలు అందించేందుకు సమన్వయం సాధ్యమవు తుంది. భవిష్యత్తులోనూ హైదరాబాద్‌కు మరింత సమగ్ర, ప్రయాణికులకు అనుకూలమైన మెట్రో నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఎల్ అండ్ టీ నుంచి మెట్రో రైలును స్వాధీనం చేసుకునే ఒప్పందానికి ముందుగా సీఎం రేవంత్‌రెడ్డిని ఎల్ అండ్ టీ ఛైర్మన్, ఎండీ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ కమాండ్ కంట్రోల్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై వారు చర్చలు జరిపారు.

# సీఎం రేవంత్‌ని కలిసిన కొత్త డీజీపీ సీవీ ఆనంద్

**శాంతిభద్రతల పరిస్థితి మెరుగుదలపై సీఎం సూచనలు**

**హైదరాబాద్, ఏప్రిల్ 29**



రాష్ట్ర నూతన డీజీపీగా నియమితులైన సీవీ ఆనంద్ బుధవారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తనను పూర్తిస్థాయి డీజీపీగా నియమించినందుకు గాను ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితిపై సీఎంతో చర్చించానని, భద్రతను మరింత మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన పలు సూచనలు చేశారని సీవీ ఆనంద్ తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా.. రాష్ట్ర ప్రజలకు సేవ చేయడానికి, రక్షణ కల్పించడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని సీఎంకు హామీ ఇచ్చినట్లు చెప్పారు.




# అది నా పెద్ద తప్పు

### ఆ సమయంలో నా మైండ్ పని చేయలేదు.. ఫరియా అబ్దుల్లా ఎమోషనల్

బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని అందుకున్న హనుమాన్ సినిమా చిన్న సినిమాగా మొదలై ప్రపంచవ్యాప్తంగా భారీ వసూళ్లు సాధించి కొత్త రికార్డులు సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ చిత్రంతో నటీనటులందరికీ మంచి గుర్తింపు లభించింది. అయితే ఈ బ్లాక్‌బస్టర్ అవకాశాన్ని తానే మిస్ చేసుకున్నానని నటి ఫరియా అబ్దుల్లా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి.తాజాగా తన కొత్త సినిమా గాయపడ్డ సింహం (మే 1 విడుదల) ప్రమోషన్స్‌లో పాల్గొన్న ఫరియా, తన కెరీర్‌కు సంబంధించిన ఆసక్తికర విషయాలను పంచుకుంది. 'జాతిరత్నాలు' తర్వాత ఇండస్ట్రీలోకి వచ్చిన సమయంలో కథల ఎంపికపై సరైన అవగాహన లేకపోవడం వల్ల 'హనుమాన్' వంటి మంచి ప్రాజెక్ట్‌ను కోల్పోయానని ఆమె తెలిపింది. ఆ సమయంలో స్క్రిప్ట్‌లను ఎలా అంచనా వేయాలో తెలియదు. మంచి కథను గుర్తించడంలో తప్పు చేశాను. నిజం చెప్పాలంటే అప్పుడు ఆలోచించకుండా 'నో' చెప్పాను. ఇప్పుడు సినిమా రిజల్ట్ చూసాక చాలా బాధగా ఉంది అంటూ ఫరియా తన మనసులోని మాటను బయటపెట్టింది. దర్శకుడు ప్రశాంత్ వర్మ, హీరో తేజ సజ్జాలను ఎక్కడ కలిసినా ఈ విషయాన్ని గుర్తుచేసుకుంటానని కూడా తెలిపింది. ఆ సమయంలో నిజంగా నాకు బ్రెయిన్ లేదు. బుద్ధిలేక నో చెప్పాను.. నిజానికి నాకు కథను ఎలా జడ్జ్ చేయాలో తెలియదు. ఇకపై కెరియర్లో కథలు ఎంచుకునే విషయంలో జాగ్రత్తగా ఆచితూచి అడుగులు వేస్తానని తెలిపింది.కథలు ఇక ఫరియా వదులుకున్న ఆ పాత్రను చివరకు అమృత అయ్యర్ దక్కించుకోగా, ఆ సినిమాతో ఆమెకు జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది. ఇండస్ట్రీలో ఒకరు వదులుకున్న అవకాశం మరొకరికి వరంగా మారుతుందనే విషయాన్ని ఈ ఉదాహరణ మరోసారి రుజువు చేసింది. ప్రస్తుతం ఫరియా తన ఆశలన్నీ 'గాయపడ్డ సింహం' సినిమాపైనే పెట్టుకుంది. ఈ చిత్రంతో మంచి విజయాన్ని అందుకుని తన కెరీర్‌కు కొత్త ఊపునివ్వాలని భావిస్తోంది.మరి ఏం జరుగుతుందో చూడాలి.

# లండన్‌లో ప్రణయగాథ



'దర్శకుడు ఈ కథ చెప్పినప్పుడు..నా కథ నాకే చెప్పాడా అనిపించింది. ఎందుకంటే నేను విదేశాల్లో చదువుకున్నా. అందుకే చాలా సన్నివేశాలు నాకు కనెక్ట్ అయ్యాయి. ఇందులోని కుటుంబ అనుబంధాలు, ప్రేమ, భావోద్వేగాలు ప్రతి ఒక్కరికీ నచ్చుతాయి' అన్నారు ఆనంద్ దేవరకొండ. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'ఎపిక్-ఫస్ట్ సెమిస్టర్' టీజర్‌ను మంగళవారం విడుదల చేశారు. లండన్ నేపథ్యంలో నడిచే ఆధునిక ప్రేమకథగా టీజర్ ఆకట్టుకుంది. భిన్న మనస్తత్వాలు కలిగిన ఓ జంట ప్రేమ ప్రయాణానికి అద్దం పడుతూ ఆసక్తికరంగా సాగింది. ఆదిత్యహాసన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ..ప్రతి ఒక్కరికి ఈ కథ మనదే కదా అనే భావనను కలిగిస్తుందన్నారు. ఈ వేసవిలో కుటుంబంతో కలిసి ఎంజాయ్ చేసేలా సినిమా ఉంటుందని దర్శకుడు ఆదిత్యహాసన్ తెలిపారు. ఇదొక అందమైన, మనసుకు దగ్గరైన ప్రేమకథ అని కథానాయిక వైష్ణవి చైతన్య చెప్పింది. ఈ చిత్రానికి సంగీతం: హేషమ్ అబ్దుల్ వహాబ్, రచన-దర్శకత్వం: ఆదిత్యహాసన్.

# రాముడికి ఇచ్చిన మాట కోసం!



పానిండియా బ్లాక్‌బస్టర్ 'హను-మాన్'కి సీక్వెల్‌గా వస్తున్న మైథలాజికల్ అడ్వెంచర్ 'జై హనుమాన్'. సప్త చిరంజీవుల మేళవింపుతో కూడిన కథాంశంతో హాలీవుడ్ 'అవెంజర్స్'ని తలపించేలా దర్శకుడు ప్రశాంత్‌వర్మ తెరకెక్కిస్తున్న ఈ వెండితెర అద్భుతానికి కథానాయకుడు 'కాంతార'ఫేం రిషబ్‌శెట్టి. ఇందులో ఆయన వీరాంజనేయుడిగా కనిపించబోతున్నారు. రానా దగ్గుబాటి కీలక పాత్ర పోషించనున్నారు. ఆ పాత్ర వివరాలను చిత్రబృందం గోప్యంగా ఉంచింది. ఇక శుక్రచార్యుడిగా అక్షయ్‌ఖన్నా.. ఇలా వివిధ పాత్రల్లో దేశంలోని పేరెన్నికగన్న తారలంతా ఈ సినిమాలో కనిపించబోతున్నారు. ఇప్పటికే ఈ సినిమా ఒక షెడ్యూల్‌ని పూర్తిచేసుకున్నది. మలి షెడ్యూల్ బుధవారం నుంచి మొదలైంది. రిషబ్‌శెట్టి, రానా, అక్షయ్‌ఖన్నాలపై కీలక సన్నివేశాలను దర్శకుడు ప్రశాంత్‌వర్మ తెరకెక్కిస్తున్నారు. రాముడికిచ్చిన మాట కోసం హనుమంతుడు చేసిన యుద్ధమే ఈ సినిమా అని ఇన్‌సైడ్ టాక్. సంక్రాంతి కానుకగా సినిమాను విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ యర్నేని, రవిశంకర్ యలమంచిలి నిర్మిస్తున్న ఈచిత్రానికి సంగీతం: గౌర హరి.

# దూరదర్శిని కలిపిన ప్రేమకథ



సువిక్షిత్, గీతికా రతన్ జంటగా నటిస్తున్న చిత్రం 'దూరదర్శిని'. 'కలిపింది ఇద్దరిని' ఉపశీర్షిక. కార్తికేయ కొమ్మి దర్శకత్వంలో జయశంకర్ రెడ్డి, పాటిమీది సంతోష్ నిర్మించారు. మే 15న ప్రేక్షకుల ముందుకురానుంది. యథార్థ సంఘటనల ఆధారంగా ఈ సినిమా తీశామని, 90వ దశకంలో చిత్రలహరి చూసిన నాటి రోజుల్ని గుర్తుకుతెస్తుందని, హృదయానికి హత్తుకునే ప్రేమకథగా అలరిస్తుందని దర్శకుడు చెప్పారు. దూరదర్శిని ఓ జంటను ఎలా కలిపిందన్నదే కథాంశమని, ప్రతీ ఒక్కరికి కన్నీళ్లు తెప్పిస్తుందని హీరో సువిక్షిత్ పేర్కొన్నారు. ఇలాంటి ప్రేమకథలు చాలా అరుదుగా వస్తాయని కథానాయిక గీతికా రతన్ తెలిపింది.

# అనకాపల్లి జాతర...



విక్రమ్ సహిదేవ్, సంధ్య వశిష్ట జంటగా నటిస్తున్న రా అండ్ రస్టిక్ థ్రిల్లర్ 'అనకాపల్లి'. ఖగేష్ తమ్మినేని దర్శకుడు. కండ్రేగుల నాయుడుతో కలిసి ప్రముఖ దర్శకుడు త్రినాథరావు నక్కిన ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జూన్ 5న సినిమా విడుదల కానున్నది. ప్రమోషన్స్‌లో భాగంగా ఈ సినిమాలోని జాతర గీతాన్ని బుధవారం మేకర్స్ విడుదల చేశారు. గణేశ్ సలాది రాసిన ఈ పాటను దేవ్‌జండ్ స్వరపరిచారు. శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ, మంగ్లీ గాత్రం ఈ పాటకు హైలైట్. నిజంగా జాతర చూస్తున్న అనుభూతిని కలిగించేలా విజువల్స్ సాగాయి. మాస్‌కి నచ్చే యాక్షన్, యూత్‌కి నచ్చే లవ్ ట్రాక్, కుటుంబ ప్రేక్షకులకు నచ్చే ఎమోషన్స్ కలగలుపుగా ఈసినిమా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. తారక్ పొన్నప్ప, త్రినాథరావు నక్కిన, ఇంద్రజ అబ్బూర్, మహబూబ్ బాషా, శ్రీనివాస వడ్లమాని, కండ్రేగుల నాయుడు తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కథ, కథనం, నక్కిన త్రినాథరావు, మాటలు: ఉదయ్ భాగవతుల, కెమెరా: మాయా.వి, నిర్మాణం: భవ్యశ్రీ మూవీ మేకర్స్, నక్కిన నెరేటివ్స్.

# ట్రంప్ ఎలిమెంట్ ఆసక్తికరం



ఈ సినిమాలో హీరో తరుణ్‌భాస్కర్..ట్రంప్‌తో పెట్టుకున్న గొడవ కారణంగా తన క్యారెక్టర్ ఎంట్రీ ఇవ్వాల్సివస్తుందని, అలా ఎందుకు జరిగిందో..దాని వెనకున్న కథేమిటో తెలుసుకోవాలంటే 'గాయపడ్డ సింహం' సినిమా చూడాల్సిందేనని అన్నారు సీనియర్ హీరో జేడీ చక్రవర్తి. ఆయన కీలక పాత్రలో తరుణ్‌భాస్కర్ కథానాయకుడిగా కశ్యప్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కిన 'గాయపడ్డ సింహం' చిత్రం మే 1న ప్రేక్షకుల ముందుకురానుంది. మంగళవారం విసా స్టాంపింగ్ పేరుతో ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ చక్రవర్తి మాట్లాడుతూ పైవిధంగా స్పందించారు. సినిమా టీమ్ అంతా తనకు మంచి మిత్రులని, అందుకే అతిథి పాత్రలో నటించానని హీరో శ్రీవిష్ణు తెలిపారు. ఈ కథలో ట్రంప్ ఎలిమెంట్ ఇంట్రెస్టింగ్‌గా ఉంటుందని దర్శకుడు కశ్యప్ శ్రీనివాస్ అన్నారు. ఈ సినిమా మొత్తం ఫ్రెండ్షిప్ వైబ్ కనిపిస్తుందని చిత్ర సమర్పకుడు పవన్ సాదినేని తెలిపారు. ఈ కార్యక్రమంలో నారా రోహిత్, కథానాయికలు మానస చౌదరి, ఫరియా అబ్దుల్లాతో పాటు చిత్రబృందమంతా పాల్గొన్నారు.

### మెక్సికో నుంచి బ్రెజిల్ వరకు 'వారణాసి'

# గ్లోబల్ హంగామా.. రాజమౌళి భారీ ప్లాన్!

సూపర్ స్టార్ మహేష్ బాబు - దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'వారణాసి' రిలీజ్‌కు ముందే అంతర్జాతీయ స్థాయిలో సంచలనం సృష్టిస్తోంది. భారతీయ సినిమా హద్దులను దాటి గ్లోబల్ ఆడియన్స్‌ను టార్గెట్ చేస్తూ ఈ చిత్ర బృందం ప్రచారాన్ని విదేశాల్లో వేగంగా ముందుకు తీసుకెళ్తోంది. ఇటీవల మెక్సికోలో జరిగిన ప్రముఖ కామిక్ కాన్ మెక్సికో ఈవెంట్‌లో 'వారణాసి'కు సంబంధించిన ప్రత్యేక గ్లింప్స్‌తో పాటు రాజమౌళి పంపిన వీడియో సందేశం ప్రదర్శించగా, అక్కడి ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. సినిమాలో ఉపయోగిస్తున్న అత్యాధునిక సాంకేతికత, గ్రాండియర్ విజువల్స్ చూసి అంతర్జాతీయ సినీ ప్రియులు ఆశ్చర్యపోయినట్లు సమాచారం. ఈ స్పందనతో ఉత్సాహంగా ఉన్న చిత్ర బృందం ఇప్పుడు బ్రెజిల్‌లో భారీ ప్రమోషన్స్‌కు సిద్ధమవుతోంది. లాటిన్ అమెరికా మార్కెట్‌లో సినిమాపై హైప్ పెంచేందుకు బ్రెజిల్‌ను కీలక వేదికగా ఎంచుకున్నట్లు తెలుస్తోంది. గతంలో రాజమౌళి తెరకెక్కించిన అక్కడ భారీ క్రేజ్ సంపాదించుకోవడం ఈ నిర్ణయానికి ప్రధాన కారణమని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ గ్లోబల్ ప్రమోషన్ వెనుక రాజమౌళి పక్కా వ్యూహం పనిచేస్తోంది. సినిమా షూటింగ్ దశలోనే అంతర్జాతీయ ఈవెంట్లలో ప్రమోషన్ చేయడం ద్వారా ప్రపంచవ్యాప్తంగా డిస్ట్రిబ్యూటర్ల దృష్టిని ఆకర్షించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. బ్రెజిల్‌లో జరగబోయే ఈ ప్రచార కార్యక్రమంలో మహేష్ బాబు వర్చువల్‌గా పాల్గొనే అవకాశమున్నట్లు టాక్ వినిపిస్తోంది. యాక్షన్ అడ్వెంచర్‌గా రూపొందుతున్న 'వారణాసి'ని ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌తో రూపొందించేందుకు చిత్ర బృందం తీవ్రంగా శ్రమిస్తోంది. ఆఫ్రికన్ అడవుల నేపథ్యంలో సాగే ఈ కథలో మహేష్ బాబు కొత్త లుక్‌లో కనిపించనున్నారు. లాంగ్ హెయిర్, రఫ్ ఫిజిక్‌తో ఆయన గెటప్ ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇక ఈ సినిమా విషయంలో రాజమౌళి అనుసరిస్తున్న గోప్యత కూడా ఆసక్తికరంగా మారింది.